# గౌతమీగాథలు

## ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

అజంతా రేఖ, ఎల్లోరా శిల్పం, కళ్ళతో పట్టుకుని, కుంచెతో ఆడించగలవాడు సుబ్బరాయశర్మ!

ఎక్కడెక్కడో తిరిగాడు. ఏవేవో గీశాడు. రాణించలేదు. మండపేట వచ్చాడు. కళాభిమానుల్ని పలకరించాడు. శ్రీమంతుల్ని ఆశ్రయించాడు. కళ్లు నిండుతున్నాయి. చెయ్యి నిండడంలేదు. కుంచె నేలకేసి కొట్టాడు.

నవ్వుతూ 'శ్రీరామ్' కుంచె తీసి చేతిలో పెట్టి నడవమన్నాడు.

రామచంద్రపురం వచ్చాడు.

పరిచయమయింది. ఇద్దరం కలల వాళ్ళమే. ఇంత లోటేమిటి? డబ్బుకు గాని—

మల్లెమొక్కల దగ్గర- అరటి చెట్ల మధ్య— సమృద్ధిగా కలలు కనవచ్చు.

కళాభారతి- చిత్ర శిక్షణశాల—

కవితాగోష్ఠులు- సాహిత్య సంపత్తులు—

గ్రంథ ప్రచురణ సంస్థ—

"ఉత్త మాటలు నీవి పొమ్మందిరా—

ఏంకి కొత్తపాటలు పాడుకొమ్మందిరా—"

రాత్రి తొమ్మిదింటికి ఆకలి జ్ఞాపకం చేస్తే ఇళ్ళకి వెళ్లేవాళ్ళం—

ఇది పూర్వపీఠిక—

అవ్వలి కథాక్రమం బెట్టిదనిన—

ఉక్కున జట్కావచ్చి గుమ్మంలో ఆగింది. అప్పుడు రిక్షాలు లేవు. 1948 మాట — జట్కాలోంచి శర్మ దిగాడు. బట్టలేసుకుని బయలుదేరమన్నాడు. ఎక్కడికి? దాక్షారం—

"సంతకా?" నవ్వుతూ అన్నాను.

"సంత రేపు- మరిచిపోయారు. ఇంకో మంతనానికి-" అన్నాడు శర్మ.

బండిలో చిత్ర పరికరాలు- డ్రాయింగు పేపరు- పడగవిప్పని పాముల్లా ఉన్నాయి.

పగలు పన్నెండుగంటలకు దాక్షారం చేరాం.

దక్షిణగోపురం దగ్గర బండి ఆగింది.

ఎడంచేతివైపు బ్రహ్మాండమైన సత్రం, కుడిచేతివైపు సప్తగోదావరి- మెట్లు- చిన్న చిన్నగుళ్ళు. నన్నే చూడమన్నట్టు ఎత్తైన గోపురం! అప్పుడు - దేవాలయాలంటె - ద్వేషం లేదు గాని- ఆసక్తిలేదు. బ్రహ్మసమాజం వాసన ఇంకా మనస్సును పట్టుకు వదలలేదు.

ఈ అభిషేకాలు, భక్తులు, దొంగ దండాలు, చిరాకు - ఎలర్జీ - ఆ గోపురం చూస్తే - ఆశ్చర్యంతో - ఆలోచనతో — మనస్సు నిండిపోయింది.

చిక్కగా కట్టిన ఆ రాతి ప్రాకారంలో- తలఎత్తి చూసే పాగ జారిపోయేటంత ఎత్తు గోపురంలో — ఏదో ప్రాచీన సుగంధం—రెడ్డిరాజుల, చాళుక్య నృపతుల ఆత్మలు యింకా - వదలలేక ప్రదక్షిణం చేస్తూన్నటే అనిపించింది.

ఎంత దీక్షతో - తపనతో - మనస్సును

## దక్షారామం

ఊగించే తాత్పర్యంతో - ఎంతలేసి రాతి పలకలు, బండరాళ్ళు ఏనుగుల చేత మోయించి తెచ్చారో. ఈ మండపాలు కట్టడానికి - ఏదో ఆత్మను నిలుపునా ఊపెయ్యాలి - ఇంత పని చెయ్యడానికి - అది మతం అనండి - మమత అనండి - మంటిగడ్డ అనండి—

ముఖం వేలాడేసుకు వచ్చిన వ్యాసుడు, కస్తూరి పరిమళంతో గుమగుమలాడే శ్రీనాథుడు, రత్న కిరీటంతో చాళుక్య భీముడు, తురాయి పట్టుపాగాతో వేమారెడ్డి నీటిబొమ్మల్లా మనస్సులో కదుల్తున్నారు.

గతంలోంచి ప్రస్తుతంలోకి లాగి శర్మ సత్రం హాలులోకి నడిపించాడు.

ఎండ చలవడింది. డ్రాయింగు పేపరు, పెన్సిలు తీసుకుని శర్మ బయలుదేరాడు. నేను అనుసరించాను. 'పన్మనుష్య మనో యథా' అని వాల్మీకి అన్నట్టు ఆ ప్రాంగణం హాయిగా, విశాలంగా వుంది.

డెబ్బై స్తంభాల మండపం ఎదురుగా నాగలింగం పూల చెట్టు. గాలికి నాలుగైదు పువ్వులు రాలాయి. అంతకన్నా ఎక్కువ రాలవు. పువ్వు చిక్కగా గట్టిగా ఉంటుంది.

శర్మ ఆప్యాయంగా ఒక పువ్వు తీశాడు. రేకలమధ్య పడగ విప్పుకున్నట్లు కేసరాలు. ఆ పడగ కింద చిన్నలింగం వంటి ఆకృతి- ఓహో! ప్రకృతే శివమయమా!

ఈ పాము పడగకింద శివలింగం ఎవరు కూర్చారు? నా బ్రహ్మ సమాజం పొడిపొడిగా రాలిపోతోంది. పువ్వు అందానికా? ఆ శివ స్వరూపానికా? శర్మ 70 సంభాల మండపంలోకి నడిచాడు. స్తంభాలమీద వున్న డిజైనకు ముగ్ధుడై డ్రాయింగు పేపరు తీసి చకచక ప్రతిబింబాలు గీస్తున్నాడు- అల్లుకున్న తీగలు- పువ్వులతో కాయలు- ఆకుజొంపాలలో ఏనుగు తలలు- ఒక నగిషీలోనుంచి పైకి లేచిన సింహముఖం. దాన్ని కప్పివెసే జూలు- కాగితం నిండిపోయింది.

దక్షిణద్వారం దగ్గర దేవతల సభ దగ్గరికి వెళ్ళాం. ఆ సభ మండపం కప్పుమీద- కళ్ళు తిరిగిపోయే శిల్పం— తల ఎత్తుకునే చూడాలి. ఒక వర్తులాకారంలో ఇంద్రాది దేవతలందరూ—

బొమ్మ గీయలేదు.

సూర్యద్వారం దగ్గరనుంచి కల్యాణ మండపంలోకి వస్తూ వుంటే - మధ్యను నిగనిగలాడే నీలశిలలో నంది. చెయ్యివేస్తే కొమ్ములు చిమ్మి ఎగసి పడేలా వుంది.

దాటి కల్యాణమండపం దగ్గరకివచ్చాం.

శర్మ చటున ఆగిపోయి చూస్తున్నాడు. ఒక స్తంభం దగ్గర నిలిచి— ఇద్దరు స్త్రీలు. నృత్యభంగిమలో చేతులు కలిపి ఒక వలయంగా ఏర్పడ్డారు. దూరానికి చూస్తే ఒక చక్రంలా కనపడుతుంది.

చక్కని ప్రతిబింబం గీశాడు.

సంధ్యాకాలం అయింది. మాణిక్యాంబ గుళ్ళో కుంకుమ పూజ. పూజదగ్గర - అందమైన పడుచులు పూలతో, పండ్లతో నిలుచున్నారు.

మాణిక్యగౌరి సౌందర్యలహరి - ఆమె విలాసంగా తన సౌందర్యం వొంటినుంచి మంచిగంధంలా పూర్చి అయిదు వేళ్ళతోనూ చిమ్మితే- ఈ ఆడపిల్లలు పుట్టారేమో- అనిపించింది.

హరహర మహాదేవ- పై అంతస్థులో భీమేశ్వరదేవుడికి సంధ్యాపూజ- గణగణ గంటలు- తెలుంగు దేశపు త్రిలింగాలలో తూర్పు సరిహద్దు ఈ భీమేశ్వర లింగం. పీఠంమీద 9 అడుగుల ఎత్తు పూజలు. అభిషేకాలు పై అంతస్థులో జరుగుతాయి.

దీపాలు వెలిగించారు. నిగనిగలాడే నల్లని రాతి సంభాల్లో దీపాలు ప్రతిఫలిస్తూ - వదిలిపోలేని శివభక్తుల ప్రాణాలా వున్నాయి!

(56 వ పేజీ చూడండి)

ఆజీవక, చార్వాక, లోకాయతిక మత ధోరణులు తలెత్తాయేమో? ఆర్యులెవ్వరూ దాసులు కాకూడదని కౌటిల్యుడన్నా, జూదంలో ఓడి స్వేచ్ఛను కోల్పోయినవాళ్ళూ, దానం యిస్తే వరులకు ఆస్తిగా మారినవాళ్ళూ, రుణాలు చెల్లించలేక అమ్ముడుపోయినవాళ్ళూ, ఇలా ఆర్యుల్లోనే దాసులు లేకుండాపోలేదు. అయితే యిది తమకు తాత్కాలికం కాగా, అసలు సిసలు దాసులకు యావజ్జీవం స్వేచ్ఛ లేకుండేది. పావం శెమ్మనుకుని వసంతసేన (మృచ్ఛకటిక)లాంటి వాళ్ళు మదనికలాంటి దాసీకి స్వేచ్ఛ యిచ్చివేస్తేతప్ప. నాగరకత వాతావరణంలోనే స్వేచ్ఛావకాశాలు. గ్రామాల్లో గొడ్డుచాకిరీ. దాసుల స్థితిని మరింత సడలిద్దామని కౌటిల్యుడు రాసిన మాటలు అచరణకు వచ్చాయో లేదో! మనువులాంటి చండశాసనులదారి వేరే. మధ్యయుగాలనేవి ఒక్కోదేశానికి వొక్కొకప్పుడు మొదలౌతా యనుకుంటే, బౌద్ధయుగానంతరం మన దేశానికి ఈ యుగాంతరం మొదలైంది. వృత్తి విభజన మరీ పెరిగి, వ్యవసాయం మూలాధారంగా జాతి జాతీ జీవించేప్పుడు దాస్యం దుర్భరంగాక తప్పలేదు. భూస్వామికంతో బాటు యిదీ మొరటుదేలింది. మన తెలుగు భాషలోని "వెంక" శబ్దానికి దాసుడనే అర్ధం. యుద్ధాలకు ప్రాణాలను తృణాలుగా అర్పించివేసే సైనికులూ, యజమానులకు రాజభోజనాలు సమకూర్చేవాళ్ళూ తాముమాత్రం తమ ప్రాణంమీద కూడా హక్కునేది లేకుండా వధకూ, చిత్రవధకూ, హింసకూ, క్షోభకూ గురైనవాళ్ళు "పంచములు" మాత్రమేకాదు-వారికంటె ఒక మెట్టెక్కువగా వుండి స్పృశ్యులైకూడా స్వేచ్ఛ కూలిపోయిన దాసులూ వున్నారు.

"దస్య" శబ్దంనుంచి వచ్చిందా "దాస" శబ్దం? రుగ్వేదంలో దాశరాజ్ఞ యుద్ధకాలం నాటికే "దివోదాస" "పదాస" పేర్లు రాజులకు కూడా (భగవత్పరంగా) వున్నాయి. కద్రువకు వినత, దేవయానికి శర్మిష్ఠ, జూదంలో గెలిచిన కౌరవులకు పాండవులూ వారి భార్య ద్రౌపదీ దాసులే. భారతంలో విదురుని కన్నతల్లి దాసిసాణిగారి చెలికత్తెలు కాదుగాని, చేటి, కంచుకి వగైరా దాసులే. "స్లావ్" జాతినుంచి "స్లేవ్" శబ్దం వచ్చినట్టే "దస్య" జాతినుంచి "దాస" శబ్దం వచ్చి వుండకూడదా? పైన పేర్కొన్న రాజుల్లో ఒకరి బిరుదు "త్రాస దస్యు"డు. ఇలా రూబెన్‌లా బౌద్ధ జాతకాలనే ఆధారం చేసుకోక, ఛన్నాలా సంస్కృత వాఙ్మయాన్ని కూడా తరిచి చూస్తేగాని, ఈ "దాస్య" వృత్తాంతం గురించి మనకింకా యెక్కువ తెలీదు.

డాక్టర్ ఉప్పల లక్ష్మణరావుగారి రచనా శోరణే వేరు. శబ్ద వుచ్చారణనిబట్టి రాస్తారు. కలం కూడా అంతే. అయితే యిందులో వుచ్చారణలోని ఒప్పులుకూడా రాతలో తప్పులౌతున్నాయి. వట్టువసుడి గల మాటల్ని దాదాపు ఇకారంతో వుచ్చరిస్తాం -కృష్ణుడు-క్రిష్ణుం-కిష్టుడు. కాని, లక్ష్మణరావు క్రుష్ణుడు అని రాస్తారు. "మృచ్ఛకటికం" 'మ్రుచ్ఛకటికం' అవుతుంది. 'జ్ఞానం' 'గ్యానం', 'యజ్ఞం' 'యగ్యం'-ఇలా ఎన్నో. మొత్తానికి చాలా సాఫీగా అనువదించారుగాని అక్కడక్కడ ఇంగ్లీషు మాటలు పానకంలో పుడకలే

—క. వి.

# ఫిడేలు రాగాలు

(6వ పేజీ తరువాయి)

పోయిన వారికోసం ఏడవకుండా బతికున్న వాళ్ళకోసం ఏడిస్తే ఈ కావ్యం బాగుంటుందని మరికొంత మంది మెచ్చుకునేవారు. అసలిట్లాటివి కావ్యంగామలచాలా? అలా చేస్తే ఏం మిగులుతుంది? అందులోంచి ఆధునిక మహాకావ్యాన్ని వండటం అవసరమా? అనే ప్రశ్నల ముళ్ళ కంచల్ని దాటి కావ్యంలోకి ప్రవేశిస్తే కవి మానసాకాశంలో అతను ఏయేవి చూసి, ఏయేవి వూహించాడో, ఏయే కల్పనలు చేశాడో అవిమాత్రం ఈ రచనకు పుష్టినీ, తుష్టినీ సమకూర్చాయి.

పొలంవెళ్లేప్రతిరైతూ సిలువ మోస్తున్న జీసస్‌లానగ్నమునికే కన్పిస్తాడు. అందుచేత కూడా అతని తాత్విక పరిధిని సంకుచితంగా చూసి మత ప్రతీకల్ని వాడాడని గోలపెట్టవచ్చు. గోల పరమేశ్వరులంతా కొయ్యగుర్రంమీద వూరేగేవారే. చివరి విందులో చివరికి తన నెవరు మోసం చేస్తారో జీసస్‌కు తెలుసు అని అన్నందుకూడా నగ్నమునిని తప్పు పట్టవచ్చు. అలాగే "సకల సంపదల్ని పరిత్యజించిన సిద్ధార్థుణ్ణి రాజ్యం పొలిమేరవరకూ చేరవేసి తిరిగొచ్చిన అశ్వం అశ్రునయనాల్తో నాగార్జున కొండలో యింకా నిలబడేవుంది- మానవుడి మనసులోమాత్రం మహాబోధి యెప్పుడో కూలిపోయింది" అని అన్నందుకు అతణ్ణి మార్క్సిస్టులు వేళాకోళం చేయవచ్చు. కాని నేనుమాత్రం కలం పక్కనపెట్టి నమస్కరిస్తాను.

[కొయ్యగుర్రం: రచన: నగ్నముని; వెల: రు. 5/-, ప్రచురణ: సృష్టిప్రచురణ, హైదరాబాదు.]

— పి. యస్.

# గీతగోవిందం

## రూపులేనిదాని రూపు

నా చరణ మంజీరమణులు కిణికిణి ధ్వనులు చేస్తూ ఉంటాయి. అతడు సురత విసరం పూర్తి చేస్తూ ఉంటాడు. వదులైపోయిన నా మొలగొలుసు మువ్వలు ఝునఝున మంటూ ఉంటాయి. అతడు నా కేశపాశాన్ని బిగియబట్టి ముద్దుగొంటాడు—

ఈ కోరిక తీరేట్టు సఖీ ఆ కేశి మథనుడితో నన్ను జతపరచవే! అంటూన్న రాధలోని లాలస, అవ్యక్తానికి వ్యక్త రూపాన్నిస్తూ వున్నలాలస.

—సూరంపూడి

చిత్రం పక్క పేజీలో ☞

## గౌతమీ గాథలు

(4వ పేజీ తరువాయి)

గుళ్ళోకి వెళ్ళ లేదు. ఎక్కడ లేడు శివుడు! శర్మ యావత్తు దేవాలయం స్కెచ్ గీసి తృప్తిగా చూస్తున్నాడు, మండపం దగ్గర—

తిరిగి వస్తూ - దక్షిణ గోపురం వైపు తోవలో ౭లజల పూలు రాలే పొగడచెటు దగ్గర ఆగి - ఆలయశిఖరంవైపు తిరిగి చూశాను. విడిచి వెళ్ళాలని లేదు.

ఏదో ఓదార్పుతో – ఉత్తేజంతో మనస్సు నిండిపోయి గొంతులో పద్యం కదిలింది :

"ఇక్కడ కాలువెట్టగ అదేమి మహత్వమొ గాని- ఊహకున్
రెక్కలు వచ్చినట్టు చననేరని
పూర్వయుగాల ప్రాలుదున్."

గోపురం దగ్గర బండెక్కాం. బండి ప్రాకారం పక్కగా వెడుతోంది.

"ఉన్నావో మరి లేనెలేవొ ఇట ఓహో భీమనాథ ప్రభూ
కన్నానించిన యంత ఆలయపు స్వర్గప్రాయ గంభీర శాం
తౌన్నత్యంబులు దివ్యశోభ లిట ఊహన్ రేచు...."

మనస్సులో పద్యం రూపు దిద్దుకుంటోంది. అది 200 పద్యాల దక్షారామ కావ్యానికి బీజం అయింది.

Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd., Vijayawada-10
Editor: Puranam Subrahmanya Sarma.